నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, మంగళవారం 3 డిసెంబర్ 2024 | NIZAMABAD




బీఆర్ఎస్ ఎడపల్లి మండల నాయకులు ఎమ్మెల్సీ కవితను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో సోమవారం కలిశారు. బీసీ కమిటీ నివేదిక ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

– ఎడపల్లి, డిసెంబర్ 2

## పింఛన్ కోసం వృద్ధుల నిరసన



రెంజల్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న వృద్ధులు

రెంజల్, డిసెంబర్ 2 : మండలకేంద్రంలోని వృద్ధులకు ప్రతి నెలా రావాల్సిన పెన్షన్ ఇంకా అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. గత నెలలో అందాల్సిన పింఛన్ కోసం మూడు నాలుగు రోజులుగా పోస్టాఫీస్ చుట్టూ తిరిగినా డబ్బులు ఇవ్వకపోవడంతో విసిగిపోయిన వృద్ధులు.. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం ఉదయం అరగంటకుపైగా బైఠాయించి నిరసన తెలిపారు. సమస్యను అధికారులకు విన్నవించుకుందామంటే కార్యాలయానికి ఎవరూ రాకపోవడంతో అసంతృప్తితో వెనుదిరిగారు.



స్పృహ కోల్పోయిన విద్యార్థినిని ఆటోలో దవాఖానకు తరలిస్తున్న బీఆర్ఎస్ నేత రాజారాంయాదవ్

## గురుకులంలో స్పృహ తప్పిన విద్యార్థిని

### దవాఖానకు తరలించిన బీఆర్ఎస్ నేత రాజారాం

ఇందల్వాయి, డిసెంబర్ 2 : గురుకుల పాఠశాలలో స్పృహ కోల్పోయిన ఓ విద్యార్థినిని బీఆర్ఎస్ నేత రాజారాం యాదవ్ దవాఖానకు తరలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రచారం చేసేందుకుగాను రాజారాం యాదవ్ సోమవారం నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లిలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలకు వెళ్లారు.

అయితే, అప్పటికే అక్కడ నీరసంగా ఉన్న ఓ బాలిక ఉన్నట్లుండి స్పృహ కోల్పోయింది. స్పందించిన రాజారాం యాదవ్ హుటాహుటిన ఆటో తీసుకొచ్చి ఆమెను ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో గురుకులాల వ్యవస్థ దెబ్బతిన్నదని, విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ర్టానికి కనీసం విద్యాశాఖ మంత్రి లేడని, విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించడానికి కార్పొరేట్లకు కొమ్ముగాయడానికి సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. గురుకులాల్లో విద్యార్థులను పంపడానికి తల్లిదండ్రులు సంకోచిస్తున్నారన్నారు. ఓ పక్క ప్రభుత్వ విద్యావ్యవస్థ పరిరక్షణ కోసం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామని చెబుతూ, మరోపక్క కార్పొరేట్ల నుంచి కమీషన్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని, ఈ కుట్రలన్నింటినీ భవిష్యత్తులో బయట పెడుతామన్నారు.

## రైతుభరోసాకు అర్హులెవరో..?

దేశంలో మరెక్కడా లేని విధంగా కేసీఆర్ తెలంగాణలో రైతుబంధుకు శ్రీకారం చుట్టారు. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా పంట సాగుకు పెట్టుబడి సాయాన్ని అందించారు. 11 విడుతల్లో రూ.వేల కోట్లు పంపిణీ చేశారు. గుంట భూమి ఉన్న రైతును అర్హుడిగా పేర్కొంటూ రైతుబంధును అమలు చేశారు. కానీ, గతేడాది డిసెంబర్ 7న అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆది నుంచి పథకాల అమలులో కోతలు పెట్టేందుకే మొగ్గు చూపుతున్నది. అర్హుల పేరిట ఎడాపెడా రైతులను పక్కన పెట్టి సగం మందికే సాయం చేయాలని యత్నిస్తున్నట్లు తెలిసింది. రైతుభరోసాపై ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ.. పథకానికి అర్హులెవరనే అంశాన్ని ఇంకా తేల్చనే లేదు. గతంలో రైతుబంధు కింద ఉమ్మడి జిల్లాలో 5.50 లక్షల మందికి కేసీఆర్ ప్రభుత్వం ఎకరాకు రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందించింది. కాంగ్రెస్ రైతుభరోసా అమలు చేస్తే, అందులో సగం మందిని ఎగ్గొట్టే అవకాశముందన్న ప్రచారం జరుగుతున్నది.



### అనుమానాలెన్నో..

రైతుబంధు స్థానంలో రైతుభరోసా పథకం తెస్తామని ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. ఆరు గ్యారంటీల్లోనూ అదే చెప్పింది. కానీ అమలులో మాత్రం చిత్తశుద్ధి చూపడం లేదు. దీంతో రైతులు మళ్లీ అప్పుల పాలవుతున్నారు. యాసంగిలో పంట సాగు చేసేందుకు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. కాంగ్రెస్ చెప్పినట్లు పెంచకపోయినా కేసీఆర్ ఇచ్చినట్లు రూ.10 వేలు అయినా ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. కానీ అది పట్టించుకునే వారే కరువయ్యారు. మరోవైపు, నాలుగైదు రోజులుగా మంత్రులు రైతుభరోసాపై చేస్తున్న ప్రకటనలు గందోరగోళానికి గురి చేస్తున్నాయి. రైతుభరోసా కన్నా పంటకు బోనస్ ఇవ్వడమే మేలని స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రే ప్రకటించడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. మరోవైపు మిగతా మంత్రులేమో రైతుభరోసా వేస్తామని చెబుతున్నారు. పెట్టుబడి సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్న రైతులకు రేవంత్ సర్కారు అండగా నిలబడుతుందా? లేక వారి ఆశలపై నీళ్లు చల్లుతుందా? అన్నది వేచిచూడాలి.

### అంతా అయోమయం..

రైతుభరోసా అమలు చేయాలంటే వ్యవసాయ శాఖ నుంచి ప్రకటన జారీకావాలి. కొత్తగా పట్టా పాస్‌బుక్కులు పొందిన వారి వివరాలను సేకరించేందుకు దరఖాస్తులు ఆహ్వానించాల్సి ఉంటుంది. కానీ ఆ ప్రక్రియ ప్రారంభమే కాలేదు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, లబ్ధిదారుల జాబితా సరిచేయడానికి వ్యవసాయ శాఖకు చాలా సమయం పడుతుంది. ఒకవేళ ప్రభుత్వం రైతుభరోసాకు సంబంధించి డిసెంబర్ మొదటి వారంలో ప్రక్రియ మొదలుపెట్టినా కొత్త సంవత్సరంలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు పడే అవకాశముంది. సాగు సమయానికి అందాల్సిన పెట్టుబడి సాయం ఆలస్యంగా అందినా ప్రయోజనం ఉండదు. వడ్డీ వ్యాపారులకు వడ్డీలు చెల్లించేందుకే అందులోని సగం మొత్తం అప్పజెప్పాల్సి వస్తుంది. పంట కాలం మొదలైన కొద్ది రోజుల్లోనే రైతుభరోసా వంటి పథకాన్ని అమలు చేయాల్సిన సర్కారు మొద్దునిద్రలో ఉండడం సరికాదని రైతులు మండిపడుతున్నారు.


# ‘భరోసా’ ఎప్పుడు?

- రైతుబంధును అటకెక్కించిన సర్కారు
- పెట్టుబడి సాయం పంపిణీలో మీనమేషాలు
- కేసీఆర్ కన్నా రూ.5 వేలు ఎక్కువ ఇస్తానన్న రేవంత్
- వర్షాకాలం ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం
- యాసంగిలోనూ ఇవ్వడంపైనా సందిగ్ధత
- అనుమానాలు రేకెత్తిస్తున్న మంత్రుల మాటలు
- ఉమ్మడి జిల్లాలో 5.50 లక్షల మంది లబ్ధిదారులు
- పెట్టుబడి సాయం కోసం ఆశగా ఎదురుచూపు

**కాంగ్రెస్ సర్కారు** రాకతో రైతాంగం కష్టాల్లో పడింది. పంట సాగుకు ముందే ఖాతాల్లో పెట్టుబడి సాయం పడే జమానా పోయింది. ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ చెప్పినట్లే రైతుబంధు పథకాన్ని రేవంత్ ప్రభుత్వం అటకెక్కించింది. తాము అధికారంలోకి రాగానే ఎకరాకు రూ.15 వేలు ఇస్తామన్న కాంగ్రెస్ గద్దెనెక్కాక కర్షకులకు మొండి‘చేయి’ చూపింది. ఇప్పటికే వర్షాకాలం ఇవ్వాల్సిన పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టిన సర్కారు.. యాసంగికి కూడా ఇచ్చేలా కనిపించడం లేదు. వివిధ సందర్భాల్లో మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలు అనేక సందేహాలు రేకెత్తిస్తున్నాయి.

– నిజామాబాద్, డిసెంబర్ 2
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ఎకరానికి ఏటా రూ.15 వేలు పెట్టుబడి సాయం చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేక పోయింది. రైతుబంధు కింద కేసీఆర్ ఇస్తున్న రూ.10 వేలకు అదనంగా ఇస్తామంటూ గప్పాలు కొట్టిన రేవంత్ సర్కారు.. అమలు చేయడంలో మాత్రం విఫలమైంది. కనీసం కేసీఆర్ ఇచ్చినట్లు రూ.10 వేలు కూడా ఇవ్వలేక ‘చేతు’లెత్తేసింది. ఇప్పటికే వర్షాకాలంలో ఇవ్వాల్సిన పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టిన ప్రభుత్వం.. యాసంగి మొదలై నెల గడిచినప్పటికీ ఆ ఊసే లేదు.



## ఉద్యోగాలు ఇవ్వాలని..

- వీఆర్ఏలు, వారి వారసుల డిమాండ్
- ఉమ్మడి జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరసన

కంఠేశ్వర్/ కామారెడ్డి, డిసెంబర్ 2 : జీవో నంబర్ 81, 85 ప్రకారం 61 ఏండ్లు నిండిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేయాలని వీఆర్ఏలు, వారి కుమారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాకేంద్రాల్లోని కలెక్టర్ కార్యాలయాల ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి ఏడాది దాటినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం ఉద్యోగాలు అందజేసి వీఆర్ఏల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్లకు వినతిపత్రాలను అందజేశారు. నిజామాబాద్‌లో నిర్వహించిన నిరసనలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ దేవయ్య, అశోక్, పండరి, రాజేందర్, హన్మాండ్లు, వేణు, ఉదయ్, శివ, శంకర్, భూమయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న వీఆర్ఏలు



వేల్పూర్ మండల విద్యావనరుల కేంద్రం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న సమగ్రశిక్షా ఉద్యోగులు

## ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

### సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

మోర్తాడ్/ వేల్పూర్, నవంబర్ 2 : తమ ఉద్యోగాలను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు సోమవారం నిరసన చేపట్టారు. సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కమ్మర్‌పల్లి, వేల్పూర్ మండలకేంద్రాల్లో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పాఠశాల విద్యాశాఖలో సమగ్ర శిక్షా ఉద్యోగులను విలీనం, రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేసే వరకు పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కమ్మర్‌పల్లిలో సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షురాలు గంగామణి, సీఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు సురేందర్, అంజయ్య, మంజుల, పెద్దులు, రతన్, వేల్పూర్‌లో ఎమ్మార్సీ సిబ్బంది కృష్ణమూర్తి, సీఆర్పీలు, ఐఈఆర్పీలు శైలజ, మౌలిక, ఝాన్సీరాణి, శ్రీనివాస్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.